## పంచాయతీల్లో ఇష్టారాజ్యం?

- పర్మిషన్ల కోసం డబ్బుల డిమాండ్
- దోమకొండలో వెలుగు చూసిన వ్యవహారం
- విచారణ చేపట్టిన డీఎల్పీవో
- మిగతా గ్రామాల్లోనూ అదే తరహా అవినీతి

బీబీపేట్(దోమకొండ), జనవరి 31 : గ్రామపంచాయతీల్లో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంటి పర్మిషన్ల నుంచి మొదలు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం భారీగా లంచాలు డిమాండ్ చేస్తున్నారు. ఇంటి నిర్మాణాలు, ట్రేడ్ లైసెన్సులు, ఆన్‌లైన్ అసెస్‌మెంట్లు, ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు ఇలా వివిధ పనుల కోసం వచ్చే వారిని డబ్బుల కోసం తీవ్రంగా వేధిస్తున్నారు. పైసలిస్తేనే పనులు చేస్తున్నారు లేదంటే ఫైళ్లు తొక్కి పెట్టి కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారు. దోమకొండ, బీబీపేట్ మండలాల్లో ఈ వ్యవహారం ఎక్కువగా ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే దోమకొండ పంచాయతీలో జరిగిన అక్రమాల పర్వంపై విచారణ కొనసాగుతుండడం అధికారుల అవినీతికి నిదర్శనమని స్థానికులు చెబుతున్నారు. డబ్బులు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండానే ట్రేడ్‌లైసెన్సులు, ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చారని కార్యదర్శిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే దోమకొండ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఉన్నతాధికారులపై ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారం రికార్డులను తయారుచేసిన సదరు సెక్రటరీ ఇటీవల వేరే మండలానికి బదిలీ అయ్యారు. ఎంపీడీవో ఫిర్యాదుతో రంగంలోకి దిగిన డీఎల్‌పీవో విచారణ చేపట్టారు. సదరు అధికారిని దోమకొండకు పిలిపించి రికార్డులు తనిఖీ చేశారు. వారం రోజుల్లో విచారణ నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు డీఎల్‌పీవో శ్రీనివాస్ 'నమస్తే తెలంగాణ'కు శుక్రవారం తెలిపారు.

**మిగతా చోట్లా అంతే..**

మిగతా గ్రామాల్లోనూ కొందరు అధికారులు సతాయిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. దోమకొండలో డబ్బులు తీసుకుని మాన్యువల్‌గా ఇంటి నిర్మాణాలకు, ట్రేడ్ లైసెన్సులకు పర్మిషన్లు ఇచ్చిన తరహాలోనే మిగతా చోట్లా అలాగే చేస్తున్నారని చెబుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో పల్లెల్లో జరుగుతున్న అవకతవకలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇబ్రహీంపేట్‌లో వైద్య శిబిరం

ఇబ్రహీంపేట్‌లో గ్రామస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

బాన్సువాడ రూరల్, జనవరి 31 : బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో జీవన్ సేవ గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పరిశుభ్రతతోనే రోగాలను దూరం చేసుకోవచ్చని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యులు సూచించారు. వైద్య శిబిరంలో గణేశ్, సాయిలుయాదవ్, శ్యాంరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీనిధి రుణాలను పారదర్శకంగా వసూలు చేయాలి

### కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, జనవరి 31 : స్త్రీనిధి రుణాలు పారదర్శకంగా పాస్ మిషన్స్ ద్వారా తిరిగి వసూలు చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పాస్ మిషన్లను సమాఖ్య ప్రతినిధులకు కలెక్టర్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్త్రీనిధికి సంబంధించిన రుణాలు సులభంగా, పారదర్శకంగా, బ్యాంకులకు వెళ్లనవసరం లేకుండా పాస్ యంత్రాల ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా పథకం సంచాలకుడు శ్రీధర్ రెడ్డి, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ కిరణ్ కుమార్, సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాఖ్య ప్రతినిధులకు పాస్ మిషన్స్‌ను అందజేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## అన్ని గ్రామాల్లో ముదిరాజ్ కమిటీలు



రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను సన్మానిస్తున్న జిల్లా ముదిరాజ్ నాయకులు

కామారెడ్డి, జనవరి 31 : జిల్లాలో ముదిరాజ్ గ్రామ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జల భిక్షపతి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ముదిరాజ్ సంఘం కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ తీర్మానం మేరకు అన్ని జిల్లాల్లో ముదిరాజ్ కార్యవర్గాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. అనంతరం రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను జిల్లా ముదిరాజ్ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు పున్న రాజేశ్వర్, నాయకులు గుర్రాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## 'సోషల్ మీడియాలో వచ్చిన వార్త అవాస్తం'

బాన్సువాడ, జనవరి 31 : బీర్కూర్ మండలంలోని రైతు నగర్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 14 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు సోషల్ మీడియాలో వస్తున్న కథనం అవాస్తవం అని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. ఇదే విషయంపై తక్షణం విచారణ చేపట్టి, అధికారులు రైతునగర్ పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టగా, ఆ పాఠశాలలో ఏ ఒక్క విద్యార్థి కూడా ఫుడ్ పాయిజన్‌కు గురికాలేదని, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవం అని తెలిపారు.

## రెండు రోజుల్లో పూర్తి చేయాలి

మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ సురేందర్

బాన్సువాడ, జనవరి 31 : బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం రూ.23 కోట్లను 600 సంఘాలకు రెండు రోజుల్లో పూర్తి చేయాలని డీఆర్డీఏ పీడీ సురేందర్ ఆదేశించారు. బాన్సువాడ పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్, నిజాంసాగర్, పిట్లం మండలాల ఏపీఎంలు, సీసీలు, వీఏవోలతో శుక్రవారం సమీక్షించారు. ఆయా మండలాల్లో బ్యాంకు లింకేజీ రుణాలను సంఘాలకు అందించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తక్కువగా రుణాలను అందించిన నస్రుల్లాబాద్ మండలంలో 4వ తేదీలోగా వంద శాతం బ్యాంకు లింకేజీలను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎంలు పద్మ, శిరీష, గంగాధర్, సీసీ సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రజాయుద్ధనౌక గద్దర్‌కు ఘన నివాళి

గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బాన్సువాడ టౌన్, జనవరి 31 : బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ.. తన ఆట, పాటలతో చైతన్యం తెచ్చిన మహా మనిషి గద్దర్ అని బాన్సువాడ దళిత సంఘాల నాయకుడు దేశాయిపేట్ ప్రశాంత్ తెలిపారు. గద్దర్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన చిత్ర పటానికి స్థానిక దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బంగారు మైసయ్య, కుమ్మరి రాజు, సంతోష్, మన్నె భూషణం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 4వ తేదీన ఇసుక వేలం

నస్రుల్లాబాద్, జనవరి 31 : మండల కేంద్రంలోని సమీకృత మండల కార్యాలయ భవన సముదాయంలో ఇసుక వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ శివారులో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సుమారు 10 ట్రాక్టర్ల ఇసుక నిల్వ డంపులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 4న మధ్యాహ్నం 12 గంటలకు ఇసుకను వేలం వేయనున్నట్లు తెలిపారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయికి ఎంపికైన జిల్లా కబడ్డీ జట్టు

కామారెడ్డి, జనవరి 31 : ఆదిలాబాద్‌లో ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి 71వ సీనియర్ పురుషుల టోర్నమెంట్ కోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లయోల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయి కబడ్డీ ఎంపికపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా సెక్రటరీ రంగ వెంకటేశ్వర్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బానాల భాస్కర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి నోముల మధుసూదన్‌రెడ్డి, కబడ్డీ జాయింట్ సెక్రటరీ రాజు, రాజేందర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణ్, సంజీవ్, సీనియర్ క్రీడాకారులు హైమద్, జగదీశ్వర్, నిరంజన్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## బోరు మోటర్ ప్రారంభం

బోరును ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్ రూప

కామారెడ్డి, జనవరి 31 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నీటి సమస్య ఉండడంతో గ్రామస్తులందరు కలిసి బోరు వేయించారు. బోరును మాజీ కౌన్సిలర్ రూప రవికుమార్ శుక్రవారం ప్రారంభించారు. బోరు దాతలు కొత్తూరు పెద్ద సాయిలు, ముల్క శ్రీను, అశోక్ రావు, నవీన్, రాజారాం, రాజు, కృష్ణ, శివరాజు, శేఖర్, ఆంజనేయులుకు పాఠశాల తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు డు పటేల్ అనిల్, ఉపాధ్యాయులు సుధారాణి, రాజ య్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సంధ్య, విద్యార్థుల తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి యోగా శిక్షణ కార్యక్రమాలు

కామారెడ్డి, జనవరి 31 : జిల్లా కేంద్రంలోని ప్రొబెల్స్ పాఠశాలలో శనివారం నుంచి 3వ తేదీ వరకు భారత స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాందేవ్ బాబా శిష్యులు పరమార్థదేవ్ సారథ్యంలో యోగా శిక్షణ కార్యక్రమం ఉంటుందని భారత స్వాభిమాన్ జిల్లా అధ్యక్షుడు రాందెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా యోగా శిబిరం ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

### బీఆర్ఎస్ లింగంపేట మండలాధ్యక్షుడు రమేశ్

సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

లింగంపేట, జనవరి 31: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. లింగంపేటలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంత నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభల్లో సంక్షేమ పథకాలపై ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను బెదిరించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం, బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ లింగంపేట గ్రామ అధ్యక్షుడు పోకల సాయిరాం, నల్లమడుగు సహకార సంఘం డైరెక్టర్ నర్సింహులు, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, నాయకులు రూప్‌సింగ్, మ్యాకలకాడి రాములు, సురేందర్, గంగారెడ్డి, నెల్లూరి గంగారాం, కొండ లక్ష్మణ్, మల్లయ్య, సందీప్, బండి నర్సింహులు, మల్లేశం, విఠల్, బొల్లు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మహ్మద్‌నగర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా అనితారెడ్డి

ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలను స్వీకరిస్తున్న అనితారెడ్డి

నిజాంసాగర్, జనవరి 31: మహ్మద్‌నగర్‌లో ఎంపీడీవో కార్యాలయాన్ని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ మొదటి అంతస్తులో ఏర్పాటుచేశారు. నిజాంసాగర్ ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న అనితారెడ్డికి మహ్మద్‌నగర్ ఎంపీడీవోగా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. దీంతో ఆమె శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఎంపీటీసీ స్థానాల సవరణ జాబితాను ప్రదర్శించారు. కార్యక్రమంలో నిజాంసాగర్ ఎంపీవో గంగాధర్, కార్యాలయ సిబ్బంది విష్ణు తదితరులు ఉన్నారు.

## వారంలో మూడు రోజులు గుడ్డు వడ్డించాలి

### ఆర్డీవో మన్నె ప్రభాకర్

భోజనం చేస్తున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 31: విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వారంలో మూడు రోజులు తప్పకుండా గుడ్డు వడ్డించాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ సూచించారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొత్త ఏ జెన్సీ నిర్వాహకులు వండిన మధ్యాహ్న భోజనాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ చరణ్‌సింగ్‌తో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో అధికారులు పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలిని గురువారం తొలగించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ప్రధానోపాధ్యాయుడు మాణిక్యంను సస్పెండ్ చేశారు. కొత్తగా నియమించిన మధ్యాహ్న ఏజెన్సీ నిర్వాహకులు వండిన భోజనాన్ని ఆర్డీవో, ఇన్‌చార్జి తహసీల్దార్ విద్యార్థులతో కలిసి తిన్నారు. సోమ, బుధ, శుక్ర వారాల్లో తప్పకుండా గుడ్డు వడ్డించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఇన్‌చార్జి హెచ్ఎం యాదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భూముల సర్వే

సర్వే నిర్వహిస్తున్న అధికారులు

పెద్దకొడప్‌గల్, జనవరి 31: పెద్దకొడప్‌గల్, బేగంపూర్ శివారులో ఉన్న భూములకు అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు శుక్రవారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఐ అంజయ్య మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పార్ట్-బీలో ఉన్న పెద్ద కొడప్‌గల్ శివారులోని సర్వే నంబర్ 337, బేగంపూర్ శివారులోని 102 సర్వే నంబర్లలో సర్వే చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్లు, ఫారెస్టు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్, జనవరి 31: నిజాంసాగర్ ఆయకట్టుకు శుక్రవారం నుంచి మూడో విడుత నీటిని విడుదల చేశారు. ప్రధాన కాలువ ద్వారా 1,300 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ శివకుమార్ తెలిపారు. ఇప్పటి వరకు రెండు విడుతల్లో 3.84టీఎంసీల నీటిని విడుదల చేశామని చెప్పారు. మూడో విడుత నీటి విడుదల 15రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు.

## పోషకాహారంపై అవగాహన కల్పించాలి

నాగిరెడ్డిపేట, జనవరి31: చిన్నారుల్లో పోషకాహారంపై ప్రతి మహిళకూ అవగాహన కల్పించాలని నిజాంసాగర్ ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్, లింగంపేట ఏపీఎం శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండలంలోని ఐకేపీ సీసీలు, సీఏలతో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు సరైన పోషకాహారం అందక, ఆరోగ్య సూత్రాలు తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామ సంఘం సమావేశాల్లో పలు విషయాలపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమాఖ్య అధ్యక్షురాలు శాంత, సభ్యులు పాల్గొన్నారు.

## మంద కృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలి

పిట్లం అంబేద్కర్ విగ్రహం వద్ద డప్పు కొడుతున్న మాదిగలు

పెద్దకొడప్‌గల్, జనవరి 31: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించనున్న 'లక్ష డప్పులు - వేయి గొంతులు' సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ పిట్లం, పెద్దకొడప్‌గల్ మండలాల అధ్యక్షులు మహిపాల్, రవీందర్ అన్నారు. సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. పిట్లం, పెద్దకొడప్‌గల్‌లోని అంబేద్కర్ విగ్రహాల వద్ద శుక్రవారం డప్పు కొట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సస్పెన్షన్ చేయడంతో అస్వస్థతకు గురైన హెచ్ఎం మాణిక్యం

హెచ్ఎంకు సపర్యలు చేస్తున్న తోటి ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 31: ఎల్లారెడ్డిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ విషయమై ఉన్నతాధికారులు గురువారం పాఠశాలలో విచారణ చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రధానోపాధ్యాయుడు మాణిక్యంతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కలెక్టర్, డీఈవో నుంచి హెచ్ఎం మాణిక్యంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వాటిని అతడికి అందజేయడంతో తీవ్ర ఒత్తిడికి గురై స్పృహతప్పి కిందపడిపోయాడు. అక్కడే ఉన్న ఎంఈవో వెంకటేశం, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు ఆయనకు సపర్యలు చేసి గోపాల్‌పేటలోని దవాఖానకు తరలించారు. చికిత్స అనంతరం లింగంపల్లిలోని ఆయన ఇంటికి చేర్చారు. ఫుడ్ పాయిజన్ విషయంలో తన ప్రమేయం లేకున్నా.. చర్యలు తీసుకున్నారని హెచ్ఎం ఆవేదన చెందినట్లు తోటి ఉపాధ్యాయులు తెలిపారు.

### మధ్యాహ్న భోజన విధుల నుంచి

## ఉపాధ్యాయులను తప్పించాలి

### పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కుశాల్

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 31: మధ్యాహ్న భోజన విధుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కుశాల్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాణిక్యంను ఆయన శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠాలు బోధించడంతోపాటు మధ్యాహ్న భోజన విధులు నిర్వహించాల్సి రావడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. మధ్యాహ్న భోజన విధులతో పాఠాలు చెప్పడం కష్టంగా మారే ప్రమాదం ఉన్నదన్నారు. ప్రభుత్వం ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆయనతోపాటు పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, వినయ్‌కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మామిడి రమేశ్‌కుమార్, ఉపాధ్యాయులు యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, వసంత్, దుర్గయ్య తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినది

★ మామిడి రేణుక భర్త: మామిడి వెంకట్రాజం, ఇ.నెం.3-67, గ్రా॥ ఇసాయిపేట్, మం॥ పాల్వంచ, జి॥ కామారెడ్డి నా యొక్క ఒపెన్ ప్లాట్ ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ 1130/2003 గలది. పాల్వంచ నుండి ఉగ్రవాయి మైసమ్మ గుడికి వెళ్ళుతుండగా పోయినది. దొరికినవారు సంప్రదించు నెం.9703986061

NTZ-334447

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ క్లాసిఫైడ్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించి కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

లింగంపేట, జనవరి 31: మండలంలోని గట్టుమైసమ్మ తండా, ఒంటర్‌పల్లి గ్రామాల్లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామస్తులు, విద్యార్థులు సన్మానించారు. మండలంలోని ఒంటర్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి బదిలీపై వెళ్తున్న బత్తుల రాములు, మురళీకృష్ణ, భాగ్యలక్ష్మి, శ్రీలతతోపాటు పంచాయతీ కార్యదర్శి ప్రవంతి, అటవీ శాఖ బీట్ అధికారి శంకరప్పకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం రజనీకాంత్‌గౌడ్, ఉపాధ్యాయులు సుజాత, కిరణ్మయి, నరేందర్, మాజీ సర్పంచులు రాజయ్య, లలితా రాందాస్, గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి, యువజన సంఘం సభ్యులు స్వామి, సంతోష్, అశోక్, లక్ష్మణ్, సుధాకర్, సంగ్యా తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

పట్టుకున్న బియ్యంతో ఎస్సై మోహన్‌రెడ్డి

బిచ్కుంద, జనవరి 31: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని సీతారాంపల్లి గ్రామానికి చెందిన సరిచంద్ టాటా ఏస్ వాహనంలో 25 బ్యాగుల్లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నాడన్నారు. వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించగా.. వెంబడించి పట్టుకున్నట్లు చెప్పారు. వాహనంతో పాటు 12.5క్వింటాళ్ల బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

## ఎస్సెస్సీ విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్

జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన రామారెడ్డి మండల విద్యార్థులు

లింగంపేట, జనవరి 31: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఫిజికల్ సైన్స్‌లో టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు ఎంఈవో షౌకత్‌అలీ తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షకు 40మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విభాగంలో లింగంపేట ఉన్నత పాఠశాలకు చెందిన షాజర్, నవదీప్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలువగా.. భవానీపేట గ్రామానికి చెందిన సంజయ్ తృతీయ బహుమతి గెలుపొందినట్లు తెలిపారు. గురుకుల పాఠశాలల విభాగంలో మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన నిషయ్, రాహుల్, మాఫిక్ మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారని అన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలకు చెందిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### జిల్లాస్థాయికి ఎంపిక..

రామారెడ్డి, జనవరి 31: రామారెడ్డిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను ఎంఈవో ఆనంద్‌రావు ప్రారంభించారు. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగం నుంచి ప్రథమ స్థానంలో ఎన్.లాస్యారెడ్డి, వై.శశికిరణ్‌రెడ్డి, ద్వితీయ స్థానంలో జ్యోత్స్న, సాత్విక, ఆశ్రమ పాఠశాలల నుంచి బి.జైకుమార్, వై.ప్రభాస్ ప్రతిభ చూపగా.. వారికి బహుమతులను అందజేశారు. వీరు 4వ తేదీన నిర్వహించనున్న జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారని తెలిపారు.